

# 15 అంత కింత్రైతే ఇంత కెంత?

మర్నాడు రాత్రి చిన్నారావు భోజనం చేసి ముస్తాబై పంతులుగారితో భేటీకి బయల్దేరేవరకు "ఓ చిన్నారావూ, ఈ చిన్నకథ విని మరీ వెళ్ళు. నన్ను నువ్వడిగిందే" అంటూ చిలక మూడో కథ ఆరంభించింది.

అనగనగా ఓ ఊళ్ళో ఓ దేవరగారు బహు నెమ్మదస్థుడు. అయినవాళ్ళు మంచివాడనీ, కానివాళ్ళు మెతక మనిషనీ అనేవారు. 'దేవుడిచ్చిన దాంతో జరుగుబాటయి పోతున్నందువల్ల కాలక్షేపానికి వైద్యం నేర్చుకున్నాడు. హస్తవాసి మంచిదైనందువల్ల కొద్దికాలానికి రాశి బాగుపడింది. కుప్పెల సంచితోనే ఆ కాలానికి గొప్పనిపించేటంతగా కుప్పతిప్పలుగా గడించాడు. ఆయనకి కొడుకుల్లేక దత్తుతెచ్చుకున్న కులదీపకుడు వాసుదేవరావుని కూడా ఈ దారిలోనే పెట్టజూశారు గాని, డబ్బొచ్చాక వచ్చిన బంధుమిత్రులంతా కుప్పెలరగదీసుకు బతకాల్సిన రాత వాడికేల అన్నందువల్ల, ఇంకా పల్లె పట్టునే అఘోరించడమేమిటని సాధించినందువల్ల, కాలేజీ చదివించకపోతే తమకు నామోషీ అని వాపోయినందువల్ల దేవరగారు నిదానంగా ఆలోచించి పట్నం కాపరం వెళ్ళి పిల్లాడిని పెద్ద బళ్ళో వేశారు. పై చదువులయాక ఆపై చదువు సంగతేమిటీ అని ప్రశ్న వచ్చింది. కొందరు సినిమా తీయించమన్నారు. రాజకీయాలన్నారు. ఇంజనీరన్నారు, అదన్నారు, ఇదన్నారు. చివరికి దేవరగారు వైద్యం మంచిదని మిత్రుల సలహాపై నిశ్చయించారు. మరోటీ మరోటీ అయితే ఒకవేళ చదువంటకపోతే ఆనక వృత్తిలో దెబ్బతింటాడు. డాక్టరీ అయితే ఆ బెడదుండదు. నా అన్నవాళ్ళు నలుగురుంటే, నెలకోమారు మన కోసం జర్రున చీదే జమీందార్లిద్దర్ని చూసుకుంటే రోజెళ్ళిపోతుంది. ఉమాపతి పెట్టె కూడా అటే పెట్టుకుంటే ప్లాసిబో మాత్తర్లిచ్చినా ప్రాక్టీసు సాగిపోతుంది. అదీ ఇదీ గాపోతే, ఆఖరికి గవర్నమెంటు డాక్టరీ అయినా దొరక్కపోదు. నిదానం మీద రోగనిదానం గ్రటా నేర్చుకోవచ్చు. అవటాని పిల్లాడిని ఆ చదువుకి పెట్టారు.

వాసుదేవరావు దేవరగా రనుకొన్నంత మేదకుడూ కాదు. బద్ధకిష్టీ గాడు. చక్కగా చదివి, విద్య ఒంట బట్టించుకున్నాడు. రోగనిదానంలో గట్టివాడనిపించుకున్నాడు. తండ్రి సంతోషించాడు గాని కొడుకు చదువూ అప్రెంటిసూ అయి తిరిగి వచ్చేసరికి పూర్తిగా మారిపోయాడు. దేశం, ప్రజలూ, బీదసాదలూ, మందుమాకులూ,

మోసాలూ, టానిక్కులూ, లైసెన్సులూ అంటూ ఎడతెరిపి లేకుండా వాగడం మొదలెట్టాడు. దేవరగారి ప్రాణం బేజారైపోయింది. మనవాణ్ని దత్తు తెచ్చుకుంటే ఇన్ని తిప్పలుండవు గదా అన్నారు కులం వాళ్ళు. దేవరగారికేం తోచలేదు. పిల్లడు దారినపడితే పేరు మార్పిస్తానని మొక్కుకొన్నారు. దిష్టి తీయించారు. తావీజు కట్టించారు. స్వగ్రామం తీసికెళ్ళి గణాచారికి చూపించి ప్రశ్న అడిగించారు. జాతకం జూపించారు. చివరికి పెళ్ళి చేసి చూశారు.

అయినా వాసు ధోరణి మారలేదు. నౌకరీ చెయ్యనన్నాడు. ప్రాక్టీసు పెట్టాడు. ఎంతసేపూ బీదసాదల మధ్య తిరిగేవాడు. ఆ దిక్కుమాలిన గుడిసెల్లోకి దూరి వాళ్ళకి మందుమాకులిచ్చి సేవచేసేవాడు. అవసరమైన ఒకరిద్దరు రోగుల్ని ఆస్పత్రిలో చేర్పించడంతో అక్కడి పరిస్థితులు తెలిశాయి. తను స్వయంగా దగ్గరుండి, రాత్రి మంచం మీద పడుకోబెట్టించిన రోగి తెల్లవారేసరికి చాప మీద పడుండడం గమనించి నిర్ఘాంతపోయాడు. నోరు చేసుకోబోయేవరకు "మీరేవన్నా షేరుహోల్డర్లా, ఏవిటా జబర్దస్తీ?" అన్నారు అక్కడి షేర్ హోల్డర్లు. జరుగుతున్న అక్రమాలతోపాటు, తనకి ఈ పరాభవం జరగడంతో వాసుదేవరావుకి పౌరుషం వేసుకొచ్చింది. పంతం పెరిగింది. పట్టుబట్టి, ఆనరరీ డాక్టరుగా చేరాడు ఆస్పత్రిలో. ఆ పదవి కూడా చాలక కొంతకాలానికి అక్కడి ఉద్యోగమే సంపాదించాడు. నాటి నుండి గగ్గోలు ఆరంభమైంది. నిజం మందుల, నిజం ఇంజెక్షన్ల, నిజం టానిక్కుల వాడకం పెరిగిపోయింది. వాసుగార్ని పిచ్చాసుపత్రిలో వెయ్యాలని తెర వెనుక సరసాలాడుకున్నారు తోటివాళ్ళు. "అయినా కాకపోయినా, అడ్డమైన వెధవలికీ మందులూ, ఖరీదైన టానిక్కులూ వాడేస్తే ఎలాగండి మీరు మరీను" అన్నారు నవ్వుతూ. "మెడికల్ సైన్సు అభివృద్ధికి పనికొచ్చే కేసులొచ్చినప్పుడు ఖరీదైన ఆపరేషనులు చేస్తున్నాం గదా! మందులు పోస్తున్నాం గదా" అని చెప్పి చూశారు. వాసుగారి చాదస్తం తగ్గలేదు. ఆ సంవత్సరం ధర్మాసుపత్రిలో మందుల వాడకం పూర్వంకన్న ఎంతో పెరిగినట్టు లెక్క తేలింది.

ఏమిటి కారణం అని కనుక్కొనేందుకు కమిటీ లేచింది. లేచి కూచుని ఆవలించి చిటికె వేసి లెక్కలు కట్టింది. ఆ క్రితం సంవత్సరాలలో రోగుల సంఖ్య కన్న ఈ సంవత్సరం రోగుల సంఖ్య బాగా తక్కువైనా, మందుల వాడకం మాత్రం బాగా ఎక్కువని బేరీజు తేలింది.

'దానికేవుంది, ఇపుడు ఇక్కడి రోగులందరికీ నిజం మందులిస్తున్నాం. అంచేత పెరుగుంటుం'దని అన్నారు వాసుదేవరావుగారు.

వారం తిరిగేసరికి వాసుదేవరావుగారు ఆస్పత్రి మందులన్నీ ఇంటికి పట్టించుకెళ్ళి లోపాయకారీగా సొంత ప్రాక్టీసు కింద అమ్మేసుకుని డబ్బు చేసుకుంటున్నాడని కమిటీ తీర్మానించింది. ప్రాంతీయ పత్రికలు ఆ వార్తని అచ్చువేశాయి. 'ఆ మైసూరెడ్లబండి ఎక్కడిదో చెప్పండి' అని సవాలు చేశాయి. అది తండ్రి డబ్బుతో కొన్నది. ఇప్పుడా మాట చెప్పినా నమ్మేట్టు లేరు. వాసుదేవరావుగారికి కంటనీరు తిరిగింది. ఈ ఉదంతం తెలీగానే దేవరగారు శివాశివా అని చెవులు మూసుకుని కన్ను మూశారు.

వాసుదేవరావుగారు ఉద్యోగానికి రాజీనామా ఇవ్వడంతో ప్రజలలో కలవరం

చెలరేగింది. ఊరంతా ఆసుపత్రి మీదా, పెద్దల మీదా విరుచుకుపడ్డారు. ఇంత ఘోరం ఇదేనన్నారు. కాని అప్పటికే కమిటీ లేచిపోయింది. ప్రభుత్వం మరోసారి దుష్టశిక్షణ చేశానన్న తృప్తితో వెనక్కి జేరగిలబడి విశ్రమించింది.

'వాసుగారూ, మీకింత ప్రజాబలం ఉందని ఈనాటిదాకా నాకు తెలీలేదు. దీన్ని చక్కగా ఎక్స్ప్లాయిటు చేసుకోవచ్చు. మీరు ఊఁ అంటే నామినేషను నేను చేస్తాను. పార్టీ మన చేతిలో ఉంది. ఎల్లక్షను రెడీగా ఉంది' అన్నాడొక మిత్రుడు.

'ఇంత నింద నెత్తినేసుకుని ఎన్నికలకు నిలవనా?' అన్నాడు వాసుగారు.

'అయ్యో మీకు తెలీందేవుంది? నెత్తి మీద నింద ఎంత ఎక్కువుంటే నిందితుడు అంత నిర్దోషి అన్నది జగమెరిగిన సత్యం. దేశ నాయకులు జోహార్లర్పించి వీడంత ధర్మరాజు వీడే అని చాటేవాళ్ళు కొందరు ఇందులోనూ కల్తీ అయిపోతున్నా మొత్తం మీద 'నిందితుడు నిర్దోషి' అన్నది నిత్య సత్యం, అన్నాడు ఎల్లక్షన్లేజంటు.

'ఒకవేళ నింద నిజమే అయితే మటుకు వెధవ ప్రజలకిదే జ్ఞాపకవాఁ? ఎక్కడికి వెళ్తారూ? నోట్లు జల్లి వోట్లు పండిస్తాం. ఇందులో ప్రజల ప్రమేయం ఎందుకూ?' అన్నాడు కొత్తగా ఆ పార్టీలో కొచ్చిన ఒకాయన - పాత అలవాటు కొద్దీ విట్టులో హిట్టు మిళాయించి.

వాసుదేవరావుగారు ఊరి మీదకెళ్ళి నాలుగు వాడలా కలయదిరిగి నలుగుర్నీ కదలేశారు. దాదాపు నూటికి తొంభై మంది ఆయన ఉద్దేశం విని ఉత్సాహంతో ఎగిరి గంతేశారు. 'మీరు కానీ విదపక్కర్లేదు. మరోడు లక్షలు కురిపినా సరే, వోట్లు నూటికి నూరూ మీకు వేస్తాం' అన్నారు. 'బాబూ, మీ ఋణం ఎలా తీర్చుకుంటాం' అన్నారు.

ఎన్నికలలో నూటికి తొంభై వోట్లు పడ్డాయి వాసుగారికి. పోటీ చేసిన వారిద్దరికీ ధరావతులు కూడా గల్లంతైపోయాయి. పార్టీ పెద్దలు కూడా తెల్లబోయారు, హఠాత్తుగా ఇంతలా ఎలా గెలిచాడూ అని. కొత్తనాయకుడన్నారు. వాసుగారు నాయకులందరికీ ముద్దొచ్చాడు. అంతా ఆదరించారు. మీ వంటి వాడుండాలన్నారు. అన్న ప్రకారం కొత్త మంత్రివర్గంలో స్థానం ఇచ్చారు.

హోదా మీద, కారు మీద ఊరుకొచ్చారు వాసుగారు. జనం ఆకాశాని కెత్తేశారు. మునిసిపలాఫీసులో పెద్దలు, ఆసుపత్రిలో షేరుహోల్డర్లు వంగి సలాములు చేశారు. సన్మాన పత్రాలు కుప్పతిప్పలు ఇచ్చారు. నీతికి నువ్వే రూపానివన్నారు. నిజాయితీకి హెడ్డాఫీసువి అని పబ్లీకున ఒప్పుకున్నారు.

'మేమందరం ఎంతో సంతోషిస్తున్నాం బాబూ మా మేలు కోరే మీరు మంత్రి అయినందుకు అంటూ ఆ రాత్రి బాగా పొద్దుపోయాక ఒక వర్కరు వచ్చి దండాలు పెట్టి వెళ్ళడంతో వాసుగారి ఒళ్ళు గగుర్పొడిచింది. అన్నట్టు 'ఇదంతా ప్రజాబలం చలవగదూ' అన్నమాట హఠాత్తుగా గుర్తుకొచ్చింది.

'ఆనాడు ప్రజలకి ఆమాత్రం సేవచేస్తే ఈనాడు ఇంతవాడివయ్యావు' అంది వాకిట్లో మిలమిల మెరుస్తున్న కారు.

హాల్లో నెహ్రూగారి ఫోటో రోజాలాకాక ప్రత్యేకాభిమానంతో తనకేసి చూసి అదోలా నవ్వినట్టయింది. తదేకంగా చూస్తూ నిలబడిపోయాడు వాసుగారు.

'మీరిలా ప్రజాసేవ చేసుకుంటూ పోతే తప్పకుండా సెంటర్‌లో మంత్రిగిరీ ఇస్తానన్నట్టుంది గదండీ ఆ నవ్వు?' అన్నాడు వెనకే వచ్చి నిల్చున్న ఎలక్షన్ ఏజంటు.

'ఆఁ ఈ సేవే మూలకిలెస్తురూ? సెంట్రల్ మినిస్ట్రీ అంటే మాటలా? ఇంతకి పదింతల సేవజేసినా చాల్దేమో' అన్నారు వాసుగారు అప్రయత్నంగా. అంటూనే అదిరిపడ్డాడు. కడుపులో ఇలాంటి ఊహలున్నట్టు గుర్తులేదు. జొరబడ్డప్పుడు గమనించలేదు. గబగబ తన గదిలోకెళ్ళి అద్దం చూసుకున్నాడు సిగ్గేసింది.

తెల్లారేసరికి కుదుటపడింది ప్రాణం.

నాటి నుంచి ద్విగుణీకృతమైన ఉత్సాహంతో మరింత జోరుగా ప్రజాసేవ చెయ్యడం మొదలెట్టాడు. అడగని వాడిది పాపం అన్నట్టు మందులు అందించసాగాడు. అలాగే అనేక ఇతర సమస్యలన్నిటా జొరబడి, సన్నకారు జీవులకు భారీ ఎత్తున సదుపాయాలు చేయసాగాడు. ఈ సేవ జోరు చూసి చూసి, ఇహ నీయనకో శిలావిగ్రహం వేస్తేగాని వీల్లేదన్న పరిస్థితికి వచ్చారు. చచ్చు సంభావనగా నెల కరడజను పార్టీలూ, పావుడజను సన్మానాలూ జరగసాగాయి. మరో అరడజను వాసుగారే ఇచ్చేవారు. మొత్తం మీద ఏ మీటింగయినా, ఏ పార్టీ అయినా, ఎవరొచ్చినా, వచ్చిన ప్రతివాడినీ ఒక్క ప్రశ్న వెయ్యడం ఆయనకి రివాజై పోయింది – 'అంతకింతైంది. ఇంత కెంతవుతుంది?' అని. ఎవరికీ ఈ ప్రశ్న బోధపడేది కాదు. 'అంతకింతంటే?' అనేవారు 'ఏం లేదు వెళ్ళిరండి' అనేవాడు వాసుగారు. జవాబు చెప్పగల మహోజ్ఞాని లేక గడుసువాడు తటస్థపడగలడన్న ఆశతోపాటు, ఈ వెర్రి ప్రశ్నవల్ల ఎదటి వాళ్ళను తికమక పెట్టడంలో ఉన్న వినోదం తోడై ఆయన ఆ ప్రశ్నని రోజుకు పదిమార్లేనా అడుగుతూ ఉండేవాడు. దేశమంతా అదో తమాషా అయిపోయింది. సినిమాలో కూడా డైలాగుగా వచ్చింది. ఆ ప్రశ్న పల్లవిగా ఒకాయన రెండర్థాల కామెడీ సాంగు రాశాడు. పత్రికల్లో వాసుదేవరావుగారి చిత్రమైన అలవాటును ఆధారం చేసుకుని ఆయన వ్యక్తిత్వాన్ని అవిష్కరిస్తూ వ్యాసాలు రాశారు. జోకులు వేశారు. ప్రతిపక్షాల వారు ఎత్తిపొడుపులకు వాడుకున్నారు. అయినా ఆ ప్రశ్నకి జవాబు దొరకలేదు.

ఇలా ఉండగా పార్టీలో చీలిక వచ్చింది. పార్టీ నాయకుడే అది ఏర్పాటు చేయించాడు. ఒకాయన చిన్న గ్రూపు కట్టి బుల్లి గొయ్యి తవ్వడానికి సిద్ధపడుతున్నట్టు పసిగట్టి, తక్షణం తనే తన అప్తుడి చేత తనకి వ్యతిరేకంగా ఓ గ్రూపు కట్టించాడు. తనంటే గిట్టక నాయకుణ్ణి ఫిరాయించదలచుకున్న వాళ్ళందరినీ ఈ విధంగా ఆ గ్రూపులోకి నడిపించి, కట్టుతప్పి పోకుండా అకట్టుకోసాగాడు. ఆ ప్రణాళికలో ఒక భాగంగా వాసుగారికీ కబురొచ్చింది. ఆయననీ ఎదుటి గ్రూపుకి ఆహ్వానించారు. ప్రజాసేవ హడావుడిలో ఉన్న వాసుగారు ఇందులో తాత్పర్యాలూ అంతర్యాలూ ఆలోచించే తీరిక లేక, రాయబారుల్ని పొమ్మన్నారు. 'నేను గ్రూపులు మార్చను. నాయకుల్ని ఫిరాయించను. పార్టీల్ని దాటను. నాకు ప్రజాసేవే ముఖ్యం. ప్రజలు నా వెనకుంటే పార్టీలు వెంటబడకేం చేస్తాయి' అన్నాడు. ఎన్ని రాయబారాలు పెట్టినా లొంగలేదు. చివరకోనాడు నాయకుడే చూచాయగా అన్నాడు – 'పోనీ ఓసారి ఆ గ్రూపుకి షికారెళ్ళి రారాదటయ్యా' అని. వాసు ఒప్పుకోలేదు.

ఇది జరిగిన వారం తరవాత, ఒకానొక పార్టీలో హఠాత్తుగా ఒకాయన వాసుగారి ప్రశ్నకి జవాబు చెప్పాడు.

'అయ్యా, అంతకింత్తైంది గాని ఇంత కింతే' అన్నాడు.

వాసుగారు అదిరిపడి, ఆయన చెయ్యి పట్టుకుని పక్కగదిలోకి లాక్కుపోయి, తలుపేసి "ఏవిటి ఏవిటి, ఏవిటి మీరన్నది? దానర్థం ఏమిటి? మీకు తెలిసిందేవిటి?" అన్నాడు కంగారుగా.

ఎదటాయన జ్ఞానిలా నవ్వాడు.

'అయ్యా మీరు సామాన్యులుగా ఉన్నప్పుడు మీ వైద్యం ద్వారా ప్రజలకు దారుణంగా సేవచేయబట్టి ఈనాడు మినిస్టరయ్యాడు. అపాటి సేవకే ఇంతయితే, ఇపుడు ఇంకా జోరుగా మందులు గుప్పించి, అవసరమైతే జబ్బులు తెప్పించి మరీ – అదే పనిగా ముమ్మరంగా సేవజేస్తే సెంట్రల్ మినిస్టరునో, ఇంకా గొప్పవాడినో కానా – అని మీ వూహా. కాని అవరు' అన్నాడు జ్ఞాని. వాసుగారికి ముచ్చెమటలూ పోశాయి. సోఫాలో కూలబడిపోయాడు 'ఏం? ఎంచేత?' అన్నాడు.

'నాయకత్వంలో తారాపథాని కెగిరేవాడు రాకెట్ లాంటివాడు' అన్నాడు జ్ఞాని.

వాసుగారికి బోధపడలేదు. జ్ఞాని మరికొంత విజ్ఞానం వెదజల్లాడు. 'రాకెట్ కి ముందు స్టేజీలుంటాయి గదా! అట్టడుగు స్టేజి కొంతపైకి తీసుకెళ్ళాక రాకెట్ దాన్ని విసర్జిస్తుంది. అప్పుడు రెండోది పుంజుకుంటుంది. దాంతో ఇంకా పైకెళ్ళి, రెండోదాన్ని వదిలేస్తుంది అక్కడి నుంచి మూడో దాంతో మరీ పైకి వెళ్తుంది. భూమ్యాకర్షణ శక్తికి అందనంత, లొంగనంత పైకి వెళ్ళిపోయి దాన్నీ వదిలేస్తుంది. ఆ తరువాత ధ్రువతారలా తారాపథంలో తిరుగుతుంది. ఇంకో తారో ఉల్కాగ్రహమో వచ్చి గుద్దుకోకుండా చూచుకుంటే చాలు. అదీ విషయం. మీరూ అంతే. ప్రజాసేవ చేసి నాయకులయ్యాక, నాయక సేవ చేసి మహానాయకులవాలి తప్ప ఇంకా మొదటి స్టేజీని పట్టుకు దేవుళ్ళాడడం మంచిదికాదు. ఆడితే ఈ ఆకర్షణ శక్తి కిందికి లాగేస్తుంది'.

'అయ్యా, మీకో నమస్కారం పెడతాను. తెలుగులో ఏడవండి' అన్నాడు వాసుగారు నీరసంగా.

'ఏం వుంది? మీరు మీ గ్రూపులో చేరండి. అప్పుడప్పుడు నాయకుల్నీ, గ్రూపుల్నీ, పార్టీల్నీ ఫిరాయిస్తూ ఉంటే తప్ప మీకు గిరాకీ ఉండదు. ఏరి, ప్రజల్లో పారేస్తారంతే' అన్నాడు జ్ఞాని.

ఆ మర్నాడు వాసుగారు, గజమున్నర స్టేటుమెంటు ఇచ్చి నాయకుడి ఆమోదంతో ఆయన మీద అభాండాలు వేసి గ్రూపు ఫిరాయించాడు. అంతవరకూ ప్రజల మధ్య వున్నవాడు వాళ్ళని వదిలేసి పైస్థాయి కెళ్ళి వివిధ రాజధానుల నుండి రారాజధాని ఢిల్లీకి వెళ్తూ, వస్తూ రైళ్ళలో, విమానాలలో జీవిస్తూ స్టేటుమెంట్ల ద్వారా ప్రజాసేవ చేస్తూ వృద్ధికి వచ్చాడు.

ఆయన నోచిన నోమే అందరూ నోచారు. 'సర్వే నాయకజనాస్సుఖినో భవన్తు' అంటూ కథ ముగించి ఆవులించింది చిలక.

కథ విన్న చిన్నారావు ఏదో అనబోయి మానేసి ఆలోచించి 'నీ దుంపతెగ' అన్నాడు.

'అదేమిటి?' అంది చిలక.

'అదికాదు. నువ్వు నిన్నా మొన్నా చెప్పిన కథలు రెండూ ఒక మోస్తరు.

నేను మా నాయకుడిని వదిలి పంతులుగారితో కలియడం తగదని నీతి చెబుతూ అప్పుడేశావు. మరి ఇవాళ ఈ కథ ఇంకోలా వుంది గదా! బాగు పడాలంటే నేను పంతులుగారి గ్రూపులో కలవాలన్నట్టు చెబుతున్నావు. ఏవిటిది? ఎవరసలు నువ్వు? ఏ గ్రూపు చిలకవి?' అన్నాడు చిన్నారావు.

చిలక సిగ్గుపడింది. "నేను మొదట్నుంచీ పంతులుగారి గ్రూపే. నిన్ను పరీక్షించడానికి నిన్నా మొన్నా అలాటి కథలు చెప్పాను" అంది.

'అయితే బయల్దేరదామా?' అన్నాడు చిలక కూర్చున్న ఉయ్యాలని కొక్కెం నుంచి తీస్తూ.

☆ ☆ ☆

రామిరెడ్డిగారు కథ ముగించి నిట్టూర్చి, ఇంకో చుట్ట ముట్టించారు.

"సుబ్బరాజా! అదీ కథ. ఎలా వుంది?"

"మీరు వేరే ప్రశ్న అడగలేదు రివాజు ప్రకారం. అంచేత ఎలా వుంది అన్నదే మీ ప్రశ్న అయితే జవాబు మీరు దగా చేశారని. నన్ను ప్రశ్నలడిగినప్పుడు మీరు కథ సొంతం సరిగ్గా చెప్పాలి. నిజంగా చెప్పాలి. చిలకో, మీరో చివర్ని టోకరా ఇవ్వడానికి ఎత్తువేశారు" అన్నాడు సుబ్బరాజు.

'అదేవిటి? చిలక టోకరా ఏవిటిచ్చింది?' అన్నాడు రెడ్డిగారు ఆశ్చర్యానికి అభినయం పట్టకుండానే.

"ఆ చిలక మొదట్నించీ పంతులుగారి గ్రూపు చిలక్కాదు. చిన్నారావుగారి ప్రొప్రయిటరే దానికీ యజమాని. ఈ రెండు కథలూ చెప్పాక, పంతులుగారు దాన్ని మంచి చేసుకున్నాడు. చిన్నారావుని ఎలాగైనా తన గ్రూపుకు తెమ్మని కోరాడు. అలా తీసుకొస్తే విదేశాలకు ఏనుగుల్నీ, పులుల్నీ బహుమతి ఇచ్చి పంపే ఏ స్కీములోనో ఆ చిలకనీ తోసేసి ఫారిను పంపిస్తానని ఆశపెట్టాడు. చిలక ప్లేటు ఫిరాయించి మూడోసారి కథ పంథా మార్చింది" అన్నాడు సుబ్బరాజు.

★ ★ ★